సాక్షి
ప్రకాశం

సోమవారం । 1 । మే । 2023



సంక్షేమ ప్రభుత్వమే ధ్యేయం

సంక్షేమ ప్రభుత్వం అందివ్వాలన్నది సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. - 8లో..



అకాల వర్షం..రైతులకు కష్టం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఈదురుగాలులతో అకాల వర్షం కురిసింది. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
37 /25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

భూసారం ఎంతెంత..!

రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారికి మేలు చేసేందుకు మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు నిలిచిపోయిన భూసార పరీక్షలను మళ్లీ చేపడుతోంది. ఈ మేరకు జిల్లాలో వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు చేసేందుకు సమాయత్తమైంది. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ పూర్తిచేసింది. భూసార పరీక్షల ఆధారంగా సాగులో తగిన యాజమాన్య చర్యలు తీసుకుంటే తక్కువ పెట్టుబడితో పంటలు బాగా పండటమే కాకుండా నాణ్యమైన దిగుబడులు వస్తాయి.

- భూసార పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధం
- ఇప్పటికే అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి
- విచక్షణా రహితంగా పురుగు మందుల వాడకాన్ని తగ్గించడమే లక్ష్యం



పొదిలి రూరల్:

ఎవరైనా సరే ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా పని చేసుకోవడంతో పాటు పది మందికి సహాయ పడతారు. భూమి కూడా అంతే.. ఆరోగ్యంగా ఉంటేనే రైతులు పండించే పంటలో నాణ్యత, అధిక దిగుబడినిస్తుంది. భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వేసే పంటలు, వాడే క్రిమి సంహారకాలు, ఎరువులను బట్టి మార్పు చెందుతుంది. ఆ మార్పులను ఎప్పటికప్పుడు కనిపెట్టి వ్యవసాయం చేస్తేనే పంటలు బాగా పండుతాయి. నాణ్యమైన మంచి దిగుబడులు వస్తాయి. విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల భూమి పటుత్వం కోల్పోతుంది. సాగుకు పెట్టుబడి వ్యయం భారీగా పెరుగుతుంది. దీనిని అధిగమించాలంటే రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి. అలాగే ఏటా రైతులు అనువైన సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భూసార పరీక్షలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసింది.



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తూ..

ఇదే సరైన సమయం..

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 1,68,513 హెక్టార్లు, రబీలో 1,33,260 హెక్టార్లలో వివిధ రకాలైన పంటలు సాగు చేస్తున్నారు. వేసవి దుక్కులు, భూ యాజమాన్య చర్యలు చేపట్టేందుకు ఏప్రిల్, మే, జూన్, నెలలు అనువు. ఈ సమయంలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలకు పంపి వచ్చిన ఫలితాల ఆధారంగా భూమి యాజమాన్య చర్యలు తీసుకోవాలి. ఎరువులు సమర్థంగా, పొదుపుగా వినియోగించి భూసారాన్ని కాపాడుకోవచ్చు.

భూసార పరీక్షలపై శిక్షణ:

భూసార పరీక్షలు చేయడంపై గత నెల 11వ తేదీ జిల్లా స్థాయిలో అన్ని సబ్ డివిజన్‌లోని వ్యవసాయ శాఖ సిబ్బందికి భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనాలు తీసే విధానంపై శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన వారు గత నెల 12 నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయిలో అన్ని సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చర్ సహాయకులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డెమో రోజు జిల్లా స్థాయిలో 50 మట్టి నమూనాలు, అన్నీ మండల స్థాయిలో కలిపి 1200 మట్టి నమూనాలు సేకరించి మొత్తం 1250 మట్టి నమూనాలను సేకరించి వాటిని పరీక్షల కోసం ఒంగోలులోని ఎస్‌టీఎల్‌కు పంపారు.

భూసార పరీక్ష చేసే కేంద్రాలు:

జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్‌టీఎల్ భూసార పరీక్ష కేంద్రంతో పాటు, నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసుకున్న ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ లాబ్స్, ఏఎంసీ ఎస్‌టీఎల్ మార్కాపురం, ఎంఎస్‌టీఎల్ గిద్దలూరులో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి.

12 రకాల పరీక్షలు

రైతుల పొలాల్లో సేకరించిన మట్టి నమూనాలకు 12 రకాల పరీక్షలు చేయనున్నారు. అవి ఉదజని సూచిక (పీహెచ్), లవణ సూచిక (ఈసీ), సేంద్రియ కర్బనం (ఓసీ), స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, సల్ఫర్ (గంధకం) లభ్యత, సూక్ష్మపోషకాలైన జింక్, కాపర్, మెగ్నీషియం, ఐరన్, బోరాన్ లభ్యత పరీక్షలు చేస్తారు. ఇవన్నీ సమతుల్యంగా ఉంటేనే పంటలు అధిక దిగుబడి వస్తాయి.

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



భూసార పరీక్షలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఒంగోలులోని భూసార పరీక్ష కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో పరీక్షలు చేస్తాం. సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం. రైతులు తమ పొలాల్లో మట్టి నమూనాలు తీయించుకొని భూసార పరీక్షలు చేయించుకుంటే తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడులు రావడానికి అవకాశం ఉంది.

– ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి, ప్రకాశం

భూసార పరీక్షలతో రైతులకు మేలు



భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. నేల స్వభావాన్ని బట్టి పురుగుమందులు వాడకం తద్వారా డబ్బులు ఆదా అవుతుంది. పంటల దిగుబడి నాణ్యత పెరుగుతుంది. అధికారుల సూచనలు సలహాలు పాటిస్తే నష్టాల నుంచి బయటపడవచ్చు.

– గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, ఏలూరు, పొదిలి మండలం

మట్టి నమూనా ఇలా సేకరించాలి...

- మట్టి నమూనా తీయాల్సిన చోట చెత్తా చెదారం లేకుండా చూడాలి. నాగలు సాలు పోయినంత లోతు వరకు, లేదంటే 6 అంగుళాల లోతు వరకు వీ అకారంలో తవ్వాలి.
- సేకరించిన నమూనాను శుభ్రమైన సంచి లేదంటే గోనె సంచి పైన పోసి కలపాలి.
- కలిపిన మట్టిలో రాళ్లు, పంట వేర్లు, కొయ్యలు తీసి వేయాలి. మట్టి తడిగా ఉంటే నీడలో ఆరబెట్టాలి.
- కలిపిన మట్టిని నాలుగు భాగాలుగా విడదీయాలి. ఎదురెదురుగా రెండు భాగాలు ఉంచి మిగతా రెండు భాగాలను తీసి వేయాలి.
- ఈ మట్టిని శుభ్రమైన గుడ్డ సంచిలో గానీ, పాలిథిన్ సంచిలోగానీ నింపాలి. ఈ ప్యాకెట్ లోపల నమూనా వివరాలున్న సమాచార పత్రం ఉంచాలి.
- సమాచార పత్రంలో రైతు పూర్తి పేరు, తండ్రి పేరు, చిరునామా, పొలంపేరు, సర్వే నంబరు, ఎంత భూమి, మెట్ట లేదా నీటి పారుదల లేదా ఆరుతడి, మూడేళ్లుగా వేసిన పైరుకి వాడిన ఎరువులు, పంట దిగుబడి వివరాలు, సాగు చేసే పంట వివరాలను రాయాలి. సేకరించిన మట్టి నమూనాలను ఏవో ద్వారా సమీపంలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపాలి.

వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షునిగా రాము



ప్రమాణం చేస్తున్న నూతనంగా ఎంపికైన వీఆర్‌ఓ సంఘం నాయకులు

ఒంగోలు అర్బన్: వీఆర్వోల (విలేజ్ రెవెన్యూ అధికారులు) సంఘం జిల్లా అధ్యక్షునిగా రాము (పీఆర్‌ఎస్ శర్మ) ఎన్నికయ్యారు. ఆదివారం అంబేడ్కర్ భవనంలో వీఆర్వోల సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. దీనిలో రాము జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియకు ఎన్నికల అధికారులు ఆర్ శ్రీనివాసరావు, బీ గోపాలకృష్ణ వ్యవహరించారు. నూతన కమిటీలో సహాధ్యక్షులుగా ఎస్ విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం రాంబాబు, ఏ రామకృష్ణారావు, ఏ వెంకటరామయ్య, పెద్దగాలిరెడ్డి, ఎంపీ రమణకుమారి, జనరల్ సెక్రటరీగా వైపీ రంగయ్య, జాయింట్ సెక్రటరీలుగా డీ పీర్సా, కె సుబ్బారావు, దారా చెన్నయ్య, శివారెడ్డి, సరస్వతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా షేక్ నాసర్‌వలి, వెలిగొండయ్య, వెంకటస్వామి, బడేసాహెబ్, కోశాధికారిగా కె జానయ్య, ప్రచార కార్యదర్శిగా ఏసీహెచ్ ఆదిరెడ్డి, ఈసీ సభ్యులుగా వి సామియేలు, కేవీ రమణ, కె చిరంజీవిరావు, బీ గురవయ్య, టీ గురవయ్య ఎంపికయ్యారు.

ప్రభుత్వ పింఛనుదారులు ఈ–కేవైసీ చేసుకోవాలి

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పింఛనుదారులంతా ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఏ.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ–కేవైసీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ప్రభుత్వ పింఛనుదారులంతా మే నెల 10వ తేదీలోపు ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఎవరికి వారు వ్యక్తిగతంగానే ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా మీ పరిధిలోని ఉప ఖజానా కార్యాలయానికి వెళ్లి సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.

కార్మికులకు మేడే శుభాకాంక్షలు

ఒంగోలు: శ్రమదోపిడీపై ప్రపంచ కార్మిక వర్గాలు చేసిన సుదీర్ఘ పోరాటాల ఫలితమే నేడు ప్రపంచ కార్మికలోకం అనుభవిస్తున్న 8 గంటల పనివిధానం అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు.

యువకుడు బలవన్మరణం


మృతుడు పాలపర్తి సురేష్

టంగుటూరు: అప్పుల బాధలు కారణంగా ఉరివేసుకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మర్లపాడు పొలాల్లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండలం లోని కొణిజేడు గ్రామానికి చెందిన పాలపర్తి సురేష్ (35) ఎండు పొగాకు ఏరుకోవడానికి మర్లపాడు పొలాల్లోకి వెళ్లాడు. అక్కడ ఎమి జరిగిందో ఏమో కానీ.. పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుని భార్య నవీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.


వల వేస్తే.. చేపలు వచ్చే..


ఉప్పు కొఠారుల్లో కూలీలు

ప్రపంచ కార్మికులారా ఏకం కండి!

కార్మిక, కర్షకుల పండగ మేడే. అలుపెరగక శ్రమించే జీవులను గుర్తించి వారిని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సోమవారం మేడే నిర్వహించేందుకు పలు ట్రేడ్ యూనియన్లు సిద్ధమయ్యాయి.

– సాక్షి, ఒంగోలు


ఇటుక బట్టీల వద్ద హుషారుగా పని..


ఊరి పరిశుభ్రత మీ చేతుల్లో..

అవసరమైనప్పుడే బ్లూ టూత్ వినియోగించండి

- బిబగ్గింగ్ తరహా సైబర్ నేరాలతో జాగ్రత్త
- బహిరంగ ప్రదేశాల్లో ఉచిత వైఫై ఉపయోగించవద్దు
- ఎస్పీ మలికా గర్గ్ సూచన


ఎస్పీ మలికా గర్గ్ (ఫైల్)

ఒంగోలు టౌన్: బ్లూ టూత్ ద్వారా జరుగుతున్న నేరాలు ఎక్కువైపోతున్న నేపథ్యంలో ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికా గర్గ్ సూచించారు. ఈమేరకు ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. హ్యాండ్ ఫ్రీ సాంకేతికత వలన నేటి రోజుల్లో చేతికి పెట్టుకునే వాచీ మొదలుకొని చెవులకు ధరించిన ఇయర్‌పాడ్ వరకు బ్లూటూత్ ఉపయోగిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైర్‌లెస్ పరిజ్ఞానాన్ని ఎక్కువగా ఉపయోగిస్తున్నారని, దాంతో ఫోన్లో బ్లూటూత్ ,వైఫై, హాట్‌స్పాట్ ఎప్పుడూ ఆన్‌లో పెట్టడం అలవాటై పోయిందని వివరించారు. దీనివల్ల సైబర్ నేరగాళ్లు ఫోన్లలోని సమాచారాన్ని సులువుగా తస్కరిస్తున్నారని, దీన్ని అడ్డం పెట్టుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారన్నారు. కేవలం పది మీటర్ల దూరం నుంచే పెయిర్ రిక్వెస్టు పంపిస్తున్నారని, పొరపాటున ఓకే బటన్ నొక్కితే చాలు మనం మోసాగాళ్ల బారిన పడినట్లే అన్నారు. ఫోన్ కనెక్ట్ అయిన వెంటనే మాల్వేర్‌తో పాటుగా ప్రత్యేకంగా తయారు చేసుకున్న ప్రోగ్రామింగ్‌ను ఫోన్లలోకి పంపించి మన ఫోన్లను వారి ఆధీనంలోకి తీసుకుంటున్నారని, ముఖ్యమైన డేటాని దొంగలించి డబ్బుల కోసం డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. బ్లూటూత్ బగ్గింగ్ తరహా సైబర్ మోసాల తీరుపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ తరహా మోసాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రతలను ఆమె సూచించారు. బిబగ్గింగ్ మోసాలకు గురైన వారు దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి ఫోన్ చేయడం కాని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

తీసుకోవాల్సిన జాగ్రతలు
- బహిరంగ ప్రదేశాల్లో అవసరమైతే తప్ప మిగిలిన సమయాల్లో బ్లూ టూత్ ఆఫ్ చేయాలి.
- బహిరంగ ప్రదేశాల్లో ఉన్నప్పుడు, రద్దీగా ఉన్నచోట బ్లూటూత్, వైఫై, హాట్ స్పాట్‌లను ఉపయోగించకుండ కూడదు.
- పరిచయం లేని వ్యక్తులు పంపించే పెయిర్ రిక్వెస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దు.
- డేటాలో హెచ్చు తగ్గుల్ని గమనిస్తూ ఉండాలి. అదనపు భద్రతకు వీపీఎన్ వినియోగించాలి.
- బహిరంగ ప్రదేశాల్లో ఉచిత వైఫై ఉపయోగించవద్దు.

నల్లబ్యాడ్జీలు పెట్టుకుని చేస్తే ఉద్యమం కాదు

- వీఆర్‌ఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వీఆర్‌ఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు

ఒంగోలు అర్బన్: కొన్ని ఉద్యోగ సంఘాలు నల్ల బ్యాడ్జీలు ధరించి రోజుల తరబడి ఉద్యమం చేస్తున్నామని చెప్తున్నారని వాటివలన ఉద్యోగులకు ఏ మాత్రం ప్రయోజనం లేదని దాదాపుగా 50 రోజులుగా ఉద్యమం చేస్తున్న ఉద్యోగ సంఘాలు ఏ ఫలితం సాధించాయో చెప్పాలని వీఆర్‌ఓ (విలేజ్ రెవిన్యూ అధికారి) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన వీఆర్వోల సంఘం జిల్లా కమిటీ ఎన్నికకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కొన్ని ఉద్యోగ సంఘాలు, రాష్ట్ర నాయకులు వారి ప్రాభవం, ప్రయోజనం కోసం మాత్రమే ఉద్యోగులను తప్పుదారి పట్టించి పనికిరాని ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఉద్యోగులకు మేలు చేయాలని చిత్తశుద్ధి ఉంటే విజయవాడ కనకదుర్గాదేవిపై ప్రమాణం చేసి అందరు ఉద్యోగులను, ఉద్యోగ సంఘాలు కలుపుకుని చిత్తశుద్ధితో ఉద్యమం చేసి ఫలితాలు సాధించాలన్నారు. దీనిలో వీఆర్‌ఓ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి


మృతి చెందిన బ్రహ్మయ్య

బేస్తవారిపేట: చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి చెందిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని చెన్నుపల్లెలో ఆదివారం జరిగింది. చెన్నుపల్లెకు చెందిన లక్కమనేని బ్రహ్మయ్య (28), కె. ఆది, షేక్ అటల్ అనే ముగ్గురు గ్రామం సమీపంలోని జెన్నివారిపల్లెలోని చెరువులోకి చేపల వేట కోసం వెళ్లారు. శనివారం రాత్రి భారీ వర్షం పడటంతో చెరువులోకి నీరు బాగా చేరింది. ముగ్గురు చెరువులోకి దిగడంతో పూడికలో కూరుకుపోయి మునిగిపోయారు. గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో చేపలు పట్టేవాళ్లు పరిస్థితి గమనించి ఆది, అటల్‌ను బయటకు తీశారు. బ్రహ్మయ్య చెరువులో మునిగిపోయాడు. మృతుడికి భార్య సరస్వతి, ఒక కుమారుడున్నారు. ఎస్సై మాధవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నల్లమల ఘాట్‌లో రోడ్డు ప్రమాదం


బస్సు, బొలెరో వాహనం ఢీ కొన్న దృశ్యం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నంద్యాల మధ్యలో గల నల్లమల ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు బొలెరో వాహనం ఢీ కొన్న సంఘటన ఆదివారం జరిగింది. అందిన వివరాల ప్రకారం నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదం వల్ల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అదృష్ట వశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ట్రాఫిక్ సమస్య పరిష్కరించారు.

సంక్షేమ ప్రభుత్వమే ధ్యేయం


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్


సబ్ రిజిస్టర్‌లో స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: సంక్షేమ ప్రభుత్వం అందివ్వాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయంగా పెట్టుకున్నారని, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక సచివాలయం-2 పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు పరుస్తున్నారని, కరోనా కష్టకాలంలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పటికి పేద ప్రజలకు అందాల్సిన సంక్షేమ ఫలాలకు ఎటువంటి ఆటంకాలు రానివ్వలేదన్నారు. లబ్ధిదారుల అకౌంట్‌లలో నేరుగా నగదు జమ చేయడం ఇష్టంలేని టీడీపీ నాయకులు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారంటూ విమర్శలకు దిగారన్నారు. ప్రజలకు అన్ని విధాల సహాయ పడటానికి గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల వ్యవస్థ సీఎం ఆలోచన విధానానికి అద్దం పడుతోందన్నారు. సచివాలయం-2పరిధిలోని చెంచు పాముల కాలనీలో మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడం వలన దోమలతో బాధపడుతున్నామని ఆ ప్రాంతం ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లారు. జగనన్న కాలనీలోని 7వ లైన్‌లో ట్రాన్స్ ఫార్మర్ సక్రమంగా లేక విద్యుత్ సరఫరా కావడంలేదని మంత్రికి తెలిపారు. దీంతో విద్యుత్ ఏఈ పి.శ్రీనివాసులును పిలిచి ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్న కాలనీలో తనకు మంజూరయిన ప్లాట్‌ను తనకు చూపించడంలేదని, ఆ ప్లాట్‌ను అధికారులు ఇతరులకు అమ్ముకున్నారని కాశింబి అనే మహిళ మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లారు. వెంటనే చర్యలు తీసుకొని కలెక్టర్‌కు నివేదిక పంపాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.దాసును మంత్రి ఆదేశించారు. ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఏవో పి.వెంకటేశ్వర్లు, ఏఈలు మహంకాళయ్య, శ్రీకాంత్, అంజిరెడ్డి, ఎంఈవో పి.ఆంజనేయులు, ఈవోఆర్డీ కె.రామసుబ్బారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్‌బ్యాంకు డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, ఎస్.విజయకుమార్, ఎం.ఆదిశేషు, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, సుబ్బారెడ్డి, ఎన్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన మంత్రి సురేష్

స్థానిక ఎస్ఈబీ కార్యాలయాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా, వారిలో ఒక కానిస్టేబుల్ సెంట్రీ డ్యూటీలో ఉన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతానికి వెళ్లిన ఆయన.. సెబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి సెంట్రీ నుంచి వివరాలు తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అందులో కొంత మంది సిబ్బంది 3 నుంచి 4 నెలలపాటు సంతకాలు చేయలేదని, మరికొంతమంది సంతకాలు చేసి స్టేషన్‌లో లేకుండా వెళ్లిపోయారని గుర్తించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తూ ఇష్టానుసారం ఉద్యోగాలు చేస్తున్నారని తెలుసుకున్న మంత్రి.. వారిపై మండిపడ్డారు. ఈ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, అక్కడున్న రిజిష్టర్‌లో ఆయన స్టేట్‌మెంట్ రికార్డుచేసి తగిన వివరణ ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. మంత్రి స్టేషన్‌లో ఉన్నట్లు తెలుసుకున్న సీఐ వెంకటరమణ.. హడావిడిగా అక్కడికి చేరుకున్నారు. మంత్రి వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ కె.దాసు, ఎంపీడీవో ఎం.రంగ సుబ్బరాయుడు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

- ఇంజినీరింగ్ విద్యార్థి మృతి


షేక్ ఆరిఫ్ (ఫైల్)


ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా

సింగరాయకొండ: గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి షేక్ ఆరిఫ్ (21) మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి సుమారు 2 గంటల సమయంలో ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న షేక్ ఆరిఫ్, పి. మనోజ్, జలగం అశోక్, మరో స్నేహితుడి కలిసి సింగరాయకొండలో సినిమాకు వచ్చి తిరుగు ప్రయాణంలో జీవీఆర్ ఆక్వా కంపెనీ సమీపంలోని శ్రీను డాబాలో భోజనం చేశారు. నలుగురు స్నేహితులు రెండు మోటారుసైకిళ్ల పై రాగా ఆరిఫ్ పెట్రోల్ కొట్టించుకుని వస్తామని చెప్పడంతో.. అశోక్ మీరు పెట్రోలు కొట్టించుకుని రండి మేము కందుకూరు ఫ్లైఓవర్ వద్ద ఉంటామని చెప్పి వెళ్లారు. తరువాత ఆరిఫ్, మనోజ్‌లు దక్షిణ ఫ్లై ఓవర్ సమీపంలోని హెచ్‌పీ బంకులో పెట్రోల్ కొట్టించుకుని తిరుగు ప్రయాణంలో కందుకూరు వెళ్లటానికి రాంగ్ రూట్‌లో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఆరిఫ్ అక్కడికక్కడే మరిణించగా, మనోజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఒక పక్క స్నేహితుల కోసం ఎదురు చూస్తున్న అశోక్ ఎంతకు రాకపోవటంతో ఫోన్ చేసినా ప్రయోజనం లేకపోవడంతో స్నేహితుల కోసం పెట్రోల్ బంకు వద్దకు వెళ్లారు. అక్కడ ఆరిఫ్ రోడ్డు పై చనిపోయి ఉండగా మనోజ్ తీవ్ర గాయాలతో రోడ్డు పక్కన రోదిస్తున్నాడు. దీంతో హతాసులైన స్నేహితులు 108కు ఫోన్ చేసి మనోజ్‌ను ఒంగోలు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ కానిస్టేబుల్ శశిధర్‌రెడ్డి సంఘటనా స్థలికి చేరుకుని పరిస్థితి సమీక్షించి ఎస్సై షేక్ ఫిరోజ్ ఫాతిమాకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆరిఫ్ తండ్రి అహమ్మద్ బాషా స్వగ్రామం నెల్లూరు జిల్లా సంగం కాగా ఇతను నెల్లూరులో వెల్డింగ్ పనిచేసుకుని జీవిస్తుంటాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందటంతో అతను కన్నీటి పర్యంతమయ్యారు. గాయపడ్డ మనోజ్ స్వగ్రామం నెల్లూరు జిల్లా పందిపాడు గ్రామం. స్నేహితులు నలుగురు ఒకే రూములో ఉంటున్నారు. ఆరిఫ్ మరణంతో కాలేజీలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై కేసు రిజిష్టరు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అకాల వర్షం.. రైతుకు కష్టం

- విరిగిపడిన చెట్లు, లేచిన ఇళ్ల రేకులు
- దెబ్బతిన్న ఉద్యానవన తోటలు
- పశ్చిమ ప్రకాశంలో భారీ వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పంటలకు నష్టం


దర్శిలో చిన కాటేరు వద్ద పొంగిన వాగు


దర్శి: లంకోజన పల్లిలో నేల వాలిన వరి


కురిచేడు: మిరపకాయలను దేవుకుంటున్న రైతులు


కురిచేడు: పంటను కాపాడుకుంటున్న రైతులు


కొనకనమిట్ల : పాతపాడు ఓ వీధిలో నిలిచిన వర్షం నీరు


లింగంగుంట్లలో విరిగి పడిన విద్యుత్ స్తంభాలు


లింగంగుంట్లలో చనిపోయిన నాటు కోళ్లు


కొనకనమిట్ల: మృతి చెందిన గొర్రెలు

కురిచేడు: మండలంలో అకాల వర్షం ఆదివారం సాయంత్రం బీభత్సం సృష్టించింది. కుండపోత వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పండ్ల తోటల్లో కాపు రాలిపోయి నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు గాలికి కిందపడిపోయాయి. చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. కురిచేడు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏఎంసీ మార్కెట్ యార్డులో అరబెట్టిన మిరపకాయల కల్లాలు తడిసి ముద్దయ్యాయి. దేకనకొండ గ్రామంలో మిరపకాయల కల్లాలు కొట్టుకుపోయాయి. మొక్కజొన్న కల్లాలు తడిసిపోయాయి.

దర్శి టౌన్: పట్టణంలో ప్రధాన వీధులు జలమయమయ్యాయి. దర్శి, పొదిలి ప్రధాన రహదారిలో చిన కాటేరు వాగు పొంగటంతో రాక పోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. బొట్ల పాలెం తిరునాళ్లకు ఏర్పాటు చేసిన ప్రభల వద్ద నీరు నిలిచింది.

పిడుగుపాటుకు 15 గొర్రెలు మృతి

కొనకనమిట్ల: పిడుగుపాటుకు గురై 15 గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన మండలంలోని ఇరసలగుండంలో ఆదివారం సాయంత్రం జరిగింది. రాచమల్ల చిన్న చెన్నారెడ్డికి చెందిన గొర్రెలు మేత కోసం పొలం వెళ్ళాయి. ఈక్రమంలో సాయంత్రం ఉరుములు మెరుపులు రావటంతో పిడుగుపడింది. గొట్లగట్టు, పాతపాడు, బచ్చలకూరపాడు, కాట్రగుంట, చిన్నారి కట్ల మెట్టువారిపల్లి గ్రామాల్లోని పొలాల్లో వర్షం నీరు చేరింది. బచ్చలకూరపాడు.. ఓవీ రోడ్డులో రహదారిపై వర్షం నీరు పారింది.

వాలి వాన అలజడి

హనుమంతునిపాడు: మండలంలో శనివారం సాయంత్ర పలు గ్రామాల్లో గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బీభత్సవం స ష్టించింది. కొత్తూరు, నందనవనం, తాళ్లవారిపల్లి, వేములపాడు, లింగంగుంట్ల, నారాయిపల్లి, రంగంపేట, రక్షణాపురం, ఉసుళ్లపల్లి, ఉమ్మనపల్లి, వెంకట్రాయునిపల్లి తదితర గ్రామాల్లో వర్షం ప్రజలను భయ భ్రాంతులకు గురి చేసింది.లింగంగుంట్ల గ్రామంలో పెంపుడు నాటు కోళ్లు చనిపోయాయి. నందనవనంలో కొప్పు రంగయ్య, కొప్పు, శేషయ్య, కొప్పు లక్ష్మీనారాయణ, సూరిశెట్టి సుధాకర్, కొండయ్యలకు చెందిన ఆకుతోటలు గాలికి దెబ్బతిన్నాయి. నిమ్మ తోటలు పూత, పిందె రాలిపోయాయి.

ఎద్దు మృతి

దర్శి టౌన్: దర్శి మండలం తానంచింతలకు చెందిన కత్తి సుబ్బారావుకు చెందిన ఎద్దు పిడుగు పాటుకు గురై ఆదివారం మృతి చెందింది. పొలం వెళ్లిన సుబ్బారావు వర్షం వస్తుండటంతో ఎద్దును చెట్టు కింద కట్టి వేయగా పిడుగు పడి మృతి చెందింది.

పిడుగుపాటుకు వ్యక్తి బలి

త్రిపురాంతకం: మిర్చి కల్లంలో కాయలపై పట్ట కప్పుకునేందుకు వెళ్లిన వ్యక్తి పిడుగు పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. త్రిపురాంతకం మండలం మిరియంపల్లి గ్రామానికి చెందిన రైతు రావెళ్ల పుల్లయ్య (73) వాతావరణం మారడంతో కల్లంలో ఉన్న కాయలు కాపాడుకునేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఉరుములు మెరువులుతో వర్షం పడుతుండటంతో పక్కనే ఉన్న చెట్ట కిందకు వెళ్లగా పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. యజమాని భోరున విలపించాడు.